క్లుప్తంగా

ఓపెన్ ఇంటర్, ఎస్సెస్సీలో చేరికకు అవకాశం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలో చదువు మధ్యలోనే నిలిపివేసిన విద్యార్థులు ఓపెన్ ఇంటర్, ఎస్సెస్సీలో చేరేందుకు అవకాశం ఉందని డీఈఓ రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఆగస్టు 8 నుంచి సెప్టెంబర్ 10లోగా ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎస్సెస్సీ వారికి రిజిస్ట్రేషన్ రూ.150, అడ్మిషన్ ఫీజు రూ.వెయ్యి, ఇంటర్ వారికి రిజిస్ట్రేషన్ రూ.300, అడ్మిషన్ రూ.1,200 ఉంటుందన్నారు. అలాగే ప్రతి సబ్జెక్టుకు ప్రత్యేక ఫీజులు ఉంటాయని చెప్పారు.

చెక్కు అందజేత

దేవరకద్ర: గోపన్‌పల్లికి చెందిన భాగ్యమ్మకు కల్యాణలక్ష్మి చెక్కు మంజూరు కావడంతో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ నాయకులు గురువారం అందజేశారు. సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రామాచారి, పార్టీ గ్రామ అధ్యక్షుడు కుమ్మరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్ ఎస్‌ఐగా శివనాగేశ్వర్ నాయుడు

మిడ్జిల్: మండల ఎస్‌ఐగా శివనాగేశ్వర్‌నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ జయప్రసాద్ నెల రోజుల నుంచి ఆరోగ్య సమస్యలపై సెలవులో ఉండడంతో ఆయనను నాగర్‌కర్నూల్ జిల్లాకు అటాచ్ చేస్తూ ఉన్నత అధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. దీంతో గతంలో ఇక్కడ పని చేసి బదిలీపై వెళ్లిన శివనాగేశ్వర్ నాయుడు మరోసారి బాధ్యతలు చేపట్టారు.

నేడు ఉర్సే షరీఫ్ వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం రామయ్యబౌలీలో గురువారం హజ్రత్ షేక్ రఫీయొద్దీన్‌షా ఖాద్రీ దర్గా, హజ్రత్ షేక్ అబ్దుల్ రహెమాన్ హుస్సేన్‌షా ఖాద్రీ షర్ఫీ ఉర్సు నిర్వహిస్తున్నట్లు ముతవల్లీ షైక్ సైఫొద్దీన్ ఖాద్రీ తెలిపారు. రాత్రి 7 గంటలకు గంధోత్సవం ఉంటుందన్నారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని తెలిపారు. రాత్రి 8 గంటలకు 9వ ధార్మికసభ నిర్వహిస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ రఫీయొద్దీన్ హుస్సేని, మహ్మద్ మహమూద్ హుస్సేని, కాజం మొహియొద్దీన్, మహ్మద్ అబ్దుల్ మొయిజ్, అబ్దుల్ మొహిమిన్, ఇష్తెకార్, కర్నూల్‌కు చెందిన హుస్సేనీ పీర్ హుస్సేని తదితర ధార్మిక వేత్తలు పాల్గొని సందేశాలు ఇస్తారని తెలిపారు.

ఫైర్‌స్టేషన్ ఆఫీసర్‌గా పి.రాజేందర్

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఫైర్‌స్టేషన్ ఆఫీసర్‌గా పి.రాజేందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా జడ్చర్ల ఫైర్ ఆఫీసర్ మల్లికార్జున్ మహబూబ్‌నగర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అచ్చంపేట నుంచి పి.రాజేందర్ జడ్చర్లకు బదిలీపై వచ్చారు.

సన్మానం

అడ్డాకుల: కొమిరెడ్డిపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఎంపీటీసీ మాజీ సభ్యులు సంతోషి, పంచాయతీ కార్యదర్శిగా పని చేసి బదిలీపై వెళ్తున్న నరేందర్‌గౌడ్, నూతనంగా పంచాయతీ కార్యదర్శిగా వచ్చిన మురళిని.. స్థానికులు గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏట రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, విండో డైరెక్టర్ నర్సింహ్మారెడ్డి, దాసరి నాగరాజు, బాలరాజు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని మాడల్‌బేసిక్ పాఠశాలలో చట్టాలపై అవగాహన కార్యక్రమాం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఐసీడీఎస్ అధికారిని జరీనా హాజరై ప్రసంగించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. తోటి వారిని ఇబ్బందులకు గురి చేయకూడని తెలిపారు. పోక్సోపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు అరుణ, మంజుల, గీత, రశ్మిత పాల్గొన్నారు.

గంధం ఊరేగింపు



జడ్చర్ల టౌన్: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీ వద్ద కొళ్ళగుట్టపై ఉన్న హజ్రత్ సయ్యద్ మొహబ్బత్ అలీషా సాహెబ్ ఖాద్రి ఉర్సు ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గంధం ఊరేగింపు వైభవంగా సాగింది. కావేరమ్మపేట షేర్ గఫూర్ గృహం నుంచి సంప్రదాయ మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గాలో గంధం సమర్పించారు. రెండు రోజుల ఉర్సు ఉత్సవాలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు కర్ణాటక లోని రాయచూర్, గుల్బర్గా, హైదరాబాద్ ప్రాంతాలనుంచి సైతం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారని నిర్వాహకులు తెలిపారు.

పరామర్శ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జిల్లా కేంద్రం ఎనుగొండకు చెందిన కళమ్మను గురువారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించి ఆమె త్వరగా కోలుకునేలా చూడాలని సూచించారు.



దాసర్‌పల్లి నుంచి పొన్నకల్ గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డుపై ఉన్న గుంతలు



వేములకు వెళ్లే దారిలో అసంపూర్తి బీటీరోడ్డు పనులతో ఏర్పడిన గుంతలు



తుంకినీపూర్ నుంచి వేములకు వెళ్లే మట్టి దారిలో గుంతలు



అచ్చాయపల్లి నుంచి కనకాపూర్‌కు వెళ్లే దారిలో ఏర్పడిన బురద

వానొస్తే వెతలే!

మూసాపేట మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే దారులు పూర్తిగా అధ్వానంగా మారాయి. ముసురు వర్షాలకు రోడ్లపై ఉన్న గుంతల్లో నీళ్లు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. మట్టిరోడ్లపై కాలినడక కూడా కష్టాలు తప్పేలా లేవు. తుంకినీపూర్ నుంచి వేములకు వెళ్లే మట్టిరోడ్డు అధ్వానంగా ఉంది. అచ్చాయపల్లి నుంచి కనకాపూర్ వెళ్లే మట్టి దారి అదే పరిస్థితి. దాసర్‌పల్లి నుంచి పొన్నకల్ వెళ్లే మట్టి రోడ్డు గుంతలమయింగా మారింది. జాతీయ రహదారి నుంచి వేములకు వెళ్లే దారిలో చందమామ బావి వద్ద అసంపూర్తి బీటీరోడ్డుపై గుంతల్లో నీళ్లు నిలవడం ద్వారా రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. అదేవిధంగా ఎన్‌హెచ్-44 నుంచి పోల్కంపల్లికి వెళ్లే బీటీరోడ్డు అసంపూర్తిగా ఉండటంతో వాహనదారులు అవస్థలను ఎదుర్కొంటున్నారు. జానంపేట నుంచి తాళ్లగడ్డకు వెళ్లే మట్టి రోడ్డులో కూడా అదే పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

– అడ్డాకుల

బడ్జెట్‌పై తలో మాట

నవాబుపేట: బడ్జెట్‌పై వివిధ పార్టీల నాయకులు భిన్న రీతిలో స్పందించారు. అధికార కాంగ్రెస్ నాయకులు రైతులకు మేలు చేస్తూ నిధులు కేటాయించారని పేర్కొనగా.. బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు ఇది అంకెల గారడీ అని, మభ్యపెట్టే ధోరణి అవలంభించారని దుయ్యబట్టారు.

రైతులకు అండగా రేవంత్ సర్కార్..



రైతన్నలకు అండగా నిలిచేలా.. రైతే రాజు అనే నానుడిని నిజం చేసే దిశగా రేవంత్ సర్కార్ బడ్జెట్ రూపొందించింది. రైతులకు పెద్దపీట వేయడం హర్షణీయం. గతంలో ఎన్నడు లేని విధంగా వ్యవసాయంతో పాటు దాని అనుబంద రంగాలకు అత్యధిక స్థాయిలో నిధులు కేటాయించారు. ఇది దేశంలోనే అత్యుతమ బడ్జెట్.

– బంగ్లారవి, కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి

రైతులను మభ్య పెట్టడమే..



రైతులను మభ్య పెట్టడం కోసమే అన్నట్లుగా బడ్జెట్ ఉంది. రుణమాఫీకి మరిన్ని నిధులు కేటాయించాల్సింది. వైద్యం, మహిళ సంక్షేమం విషయంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కంటితుడుపుగా కేటాయింపులు ఉన్నాయి. ప్రభుత్వం పథకాల పేరుతో ఎన్నికల తాయిలాలు ప్రకటించినట్లు ఉంది. గ్రామీణస్థాయిలో వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వాల్సింది.

– మధుసూదన్‌రెడ్డి, బీజేపీ జిల్లా నాయకుడు

స్థానిక ఎన్నికల కోసమే..



బడ్జెట్‌లో రూ. కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం.. తాము ఎన్నికల ముందు ప్రకటించిన హామీలను పరిష్కరించేలా బడ్జెట్ పొందుపరచలేదు. కేవలం స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రకటన చేసినట్లుగా ఉంది. ప్రజలను గత ఎన్నికల సమయంలో మాదిరిగా మరోసారి మోసం చేసే ప్రయత్నంలా కనిపించింది. కులాలను విడదీసి బడ్జెట్లో నిధులు కేటాయించడం విడ్డూరంగా ఉంది. నిరుద్యోగుల ఊసే లేదు. కేవలం అంకెల గారడీ చేశారు.

– నర్సింహులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, నవాబుపేట

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న శ్రీనివాసయ్య తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు జీవితంలో చేరుకోవాల్సిన లక్ష్య సాధన కోసం కృషి చేయాలని పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని వాసవీ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు సమయం వృథా చేయకుండా క్రమశిక్షణతో చదవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసయ్య, అకాడమిక్ డైరెక్టర్ రజినీకాంత్, ప్రిన్సిపాల్ కొండస్వామి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రసత్యం సేవలు మరువలేం



నివాళి అర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

జడ్చర్ల టౌన్: మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం (సత్యనారాయణ) జయంతి పురస్కరించుకుని గురువారం జడ్చర్లలో ఆయనకు ఘన నివాళి అర్పించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ పి.మురళి, మాజీ సర్పంచ్ రేణుక ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. పాలమూరు ముద్దుబిడ్డ ఎర్రసత్యం అని కొనియాడారు. కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు తెలుగు సత్తయ్య, చీకూరి శివ, వీడియో శ్రీనివాస్, శాంతయ్య, నర్సింహులు, చంద్రమౌళి, ఎడ్లబాబన్నలు పాల్గొన్నారు.

బీసీసేన ఆధ్వర్యంలో.. రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ తదితరులు నివాళి అర్పించారు. ఎర్రసత్యం ఆశయసాధనకోసం పాటు పడదామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేగా ఆయన సేవలు మరువలేమన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ ఇంటి వద్ద సైతం కార్యక్రమం నిర్వహించారు. గోపాల్, శేఖర్, బుజ్జి, పరుశవేది, మురళీ, రమేష్ పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌పై నిర్లక్ష్యం



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిన్నచింతకుంట: ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ అమలు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు దశరథ్, కుర్వ రమేష్ ఆరోపించారు. గురువారం ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని చెప్పి.. ఇప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెంకటేశ్వర్ రెడ్డి, జడలయ్య, ఎర్ర వెంకటన్న, గుబ్బశ్రీను, మహేష్ యాదవ్, నరసింహులు యాదవ్, బాలస్వామి, మాసన్న, బాలచందర్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలభిషేకంలో పాల్గొన్న క్రీడాసంఘాల ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర బడ్జెట్‌లో క్రీడారంగానికి గతంతో పోలిస్తే ఎక్కువ నిధులు కేటాయించడం అభినందనీయమని పలువురు క్రీడాసంఘాల ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియం ఆవరణలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. క్రీడారంగం అభివృద్ధి కోసం రూ.325.5కోట్లు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, జిల్లా యోగా సంఘం కార్యదర్శి బాల్‌రాజు, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి జియావుద్దీన్, ఆయా క్రీడా సంఘాల ప్రతినిధులు ముత్యం గురుస్వామి, దామోదర్‌రెడ్డి, చెన్న వీరయ్య, యూ.శ్రీనివాసులు, అహ్మద్ హుస్సేన్, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ గోదాం పాలమూరుకు మార్చాలి

నవాబుపేట: రేషన్ సరుకుల గోదాంను తాజాగా జిల్లా కేంద్రం నుంచి జడ్చర్లకు మార్చడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండల చౌకధర దూకాణాల డీలర్లు వాపోయారు. గురువారం జేసీ మోహన్‌రావుకు వినతిపత్రం అందించారు. గోదాంను తిరిగి పాలమూరుకు మార్చాలని అన్నారు. జంగయ్య, రామకృష్ణ, నారాయణ, పరుశవేది, గీత, బాల్‌రాజ్, గోపాల్ తదితరులు ఉన్నారు.

కించపరిచే పోస్టులు పెట్టొద్దు

అడ్డాకుల: వాట్సప్ గ్రూపులు, సోషల్ మీడియాలో ఎవరినీ కించపరిచే విధంగా పోస్టులను పెట్టొద్దని అడ్డాకుల ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. వ్యక్తులు లేదా పార్టీలను కించపరిచినా, రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసి ఘటనలకు కారణమైనా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాట్సప్ గ్రూపులలో ఎవరైనా సమస్యాత్మకంగా ఉంటే వారిని అడ్మిన్లు వెంటనే తొలగించాలని అన్నారు. లేదంటే అడ్మిన్లపై చట్టపరమైన చర్యలుంటాయన్నారు.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిందేమీలేదు

హన్వాడ: పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిందేమీ లేదని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో బీజేపీ ఎంపీలు ఎనిమిది మంది ఉన్నా ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. మండల అధ్యక్షుడు వి.మహేందర్, డీసీసీ ప్రధానకార్యదర్శి కృష్ణయ్య, కార్యదర్శి కృష్ణయ్యయాదవ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బాటలోనే కాంగ్రెస్

చిన్నచింతకుంట: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం చిన్నచింతకుంటలో పార్టీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పద్మజారెడ్డి ఈసందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ అమలు సాధ్యం కానీ హామీలను ఇచ్చిందని ఆరోపించారు. వాటిని నెరవేర్చలేక చేతులెత్తేసిందన్నారు. బీఆర్‌ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందన్నారు. మండల అధ్యక్షుడు దశరథ్, కుర్వ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల నిరసన

పాలమూరు: రాష్ట్ర ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పాలమూరు బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కృష్ణవర్ధన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, పట్టణ అధ్యక్షుడు నారాయణ యాదవ్, నాగరాజు పాల్గొన్నారు.

కవలలకు ప్రాణం పోసిన వైద్యులు



పాలమూరు: నెలలు నిండకముందే ప్రసవం కావడం వల్ల బరువు తక్కువతో పుట్టిన కవల పిల్లలకు(ఒక ఆడ, ఒక మగ) అత్యాధునిక వైద్య సేవలు అందించినట్లు సుశ్రుత ప్రజా వైద్య శాల వైద్యురాలు ప్రియాంక తెలిపారు. గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నవాబ్‌పేట మండలం మరికల్‌కు చెందిన సుమతికి మే 13న ఆస్పత్రిలో కవల పిల్లలు జన్మించారని అన్నారు. బరువు తక్కువగా ఉండటం వల్ల ఇద్దరికీ శ్వాస ఇబ్బందులు, అవయవాలు సక్రమంగా పెరగక పోవడంతో వెంటిలేటర్‌పై చికిత్స అందించినట్లు తెలిపారు. దాదాపు 72రోజుల తర్వాత ఇద్దరూ బరువు పెరిగారని.. ఇప్పుడు ఎలాంటి సమస్యలు లేవన్నారు. పూర్తిగా ఆరోగ్య శ్రీ కింద చికిత్స అందించామని వివరించారు. డాక్టర్ నిఖిల్ కుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ సూచించారు. వన మహోత్సవంలో భాగంగా గురువారం బోయపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం వద్ద మొక్కలు పంపిణీ చేశారు. వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కౌన్సిలర్లు మోతీలాల్, జాజిమొగ్గ నర్సింహులు, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఎం కవిత, స్థానిక నాయకులు శరత్, అబ్దుల్‌హక్, వెంకటస్వామి, యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏడు, ఎనిమిదో వార్డుల పరిధిలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానికులకు మొక్కలు పంపిణీ చేశారు. అదేవిధంగా పదోవార్డు పరిధిలోని మారుతీ నగర్‌లో గురువారం మున్సిపల్ చైర్మన్ పర్యటించారు. కాగా వివిధ సమస్యలపై స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఆయన త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

జిల్లాకేంద్రంలో బస్టాండు సమీపంలో మెయిన్ రోడ్డు ఫుట్‌పాత్‌పై ఇటీవల పెద్ద కుండీ లు ఏర్పాటు చేసి వాటిలో మున్సిపల్ సిబ్బంది వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. అయితే వీటివల్ల పాదచారులకు ఇబ్బంది కలగడమే గాక తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని పోలీసులు గుర్తించారు. ఈ విషయమై గురువారం మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డిలతో డీఎస్పీ సుదర్శన్, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ చర్చించారు. అనంతరం అక్కడికి అందరూ చేరుకుని సిబ్బందితో పక్కకు జరిపించారు.

దాసర్‌పల్లికి ఆర్టీసీ బస్సు రావాలని ధర్నా



బస్సు ఎదుట రోడ్డుపై బైఠాయించిన దాసర్‌పల్లి గ్రామస్తులు

చిన్నచింతకుంట: దాసర్‌పల్లిలోకి ఆర్టీసీ బస్సు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆత్మకూర్, దేవరకద్ర రహదారిపై గ్రామ స్టేజీ వద్ద స్థానికులు ధర్నా చేపట్టారు. రోడ్డుపై బస్సును నిలిపి బైఠాయించారు. గ్రామస్తుడు రమేష్ మాట్లాడుతూ ఆత్మకూర్, దేవరకద్ర రహదారికి దాసర్‌పల్లి కిలోమీటర్ దూరంలో ఉందన్నారు. గ్రామంలోకి బస్సురాక ఇబ్బందులు పడాల్సివస్తోందని వాపోయారు. రాత్రి సమయంలో వృద్ధులు, దూర ప్రాంతాలకు వెళ్లివచ్చే విద్యార్థులు చీకట్లో నడిచి రావాలంటే భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాత్రి 8 గంటలకు ఆత్మకూర్ నైటాల్ బస్సును, ఉదయం 6గంటలకు దేవరకద్రకు వెళ్లే బస్సు గ్రామంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మహబుబ్‌నగర్ డిపో మేనేజర్ సుజాత వారం రోజులల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రిలో వసతులు కల్పించాలి



ఈఎస్‌ఐ ఆస్పత్రి వద్ద మాట్లాడుతున్న కురుమూర్తి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఈఎస్‌ఐ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిని సందర్శించి మాట్లాడారు. ఆస్పత్రిలో పలు సమస్యలు వెలుగులోకి వచ్చిన సందర్భంగా సందర్శించినట్లు వివరించారు. కార్మికులకు అందుబాటులో ఉంచాల్సిన ఆస్పత్రిని పట్టణ శివారులో పెట్టడం సరికాదన్నారు. ఇరుకైన ఓ ఇంటిలో నిర్వహణ, డాక్టర్ల కొరత, సిబ్బంది సమయపాలన వంటి సమస్యలు ఉన్నాయన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కిల్లె గోపాల్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాయల చంద్రశేఖర్ ఆశయాలు కొనసాగిద్దాం



సంతాప సభలో పాల్గొన్న నాయకులు

దేవరకద్ర: రాయల చంద్రశేఖర్ ఆశయాలు కొనసాగిద్దామని వక్తలు అన్నారు. గురువారం దేవరకద్రంలో సంతాప సభ నిర్వహించారు. సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కృష్ణ మాట్లాడారు. రాయల చంద్రశేఖర్ విప్లవ జీవితం ఎంతో గొప్పదని ఆచరణీయమైనదని, అనుసరణీయమైనదని అన్నారు. జిల్లా కార్యదర్శి సీహెచ్ రాంచందర్, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు దేవదానం, జిల్లా కార్యదర్శి సాంబశివుడు తదితరులు ప్రసంగించారు. నాయకులు గణేశ్, ప్రవీణ్, వెంకటేశ్‌గౌడ్, చంద్రన్న, నర్సింహా, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో పనులు చేపట్టాలి



పనులను పరిశీలిస్తున్న అధికారులు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని శ్రీ ఆదిఆంజనేయస్వామి ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ భవన పనులను నాణ్యతతో చేపట్టి సకాలంలో పూర్తిచేయాలని పంచాయితీరాజ్ ఈఈ నరేందర్‌రెడ్డి సూచించారు. గురువారం పనులు పరిశీలించారు. అనంతరం మండలంలో జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్ రెడ్డి, డిప్యూటి ఈఈ సురేందర్‌రెడ్డి సూపర్‌వైజర్ నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

ముసురుతో కూలుతున్న ఇళ్లు



రుద్రారంలో కూలిన ఇల్లు

నవాబుపేట: మండల పరిధిలో ముసురు కొనసాగుతుండడంతో ఇల్లు కూలుతున్నాయి. దీంతో ప్రజలు నిరాశ్రయులుగా మారుతున్నారు. ఇప్పటివరకు పలు ఘటనలు చోటు చేసుకున్నా.. అధికారులు ముందుగానే హెచ్చరికలతో జాగ్రత్తపడడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. కాగా గురువారం నాటికి మండలంలో వివిధ గ్రామాల్లో 5 ఇళ్లు పాక్షికంగా కూలినట్లు అధికారులు వివరించారు. కాగా వివరాలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ నాన్యనాయక్ తెలిపారు.